ప్రజాశక్తి

బుధవారం 6 మార్చి 2024 5 విజయనగరం



ఇద్దరు ఇంటర్ విద్యార్థులు డిబార్

పరీక్షకు 848 మంది గైర్హాజరు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలో మంగళవారం మాస్ కాపీయింగ్‌కు పాల్పడిన ఇద్దరు విద్యార్థులను అధికారులు డిబార్‌చేశారు. కొత్తవలసలోని భారతి జూనియర్ కళాశాలలో ఒకరు, వంగర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒకరు డిబార్ అయ్యారని అర్ ఐఒ ఎం.ఆదినారాయణ తెలిపారు. మంగళవారం జరిగిన పరీక్షలో 73 కేంద్రాల్లో 19852 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా వారిలో 19004 మంది హాజరయ్యారని, 848 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.



నిరసన శిబిరానికి మద్దతుగా మాట్లాడుతున్న వైసిపి నాయకులు అంబళ్ల శ్రీరాములునాయుడు

మిమ్స్ ఉద్యోగుల పోరాటానికి

వెల్లువెత్తిన మద్దతు

- నిరసన శిబిరానికి తరలివచ్చిన పలు గ్రామాల నాయకులు, ప్రజలు
- ఉద్యోగుల ర్యాలీ, రహదారిపై బైఠాయింపు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

మిమ్స్ ఉద్యోగులు, కార్మికులు చేస్తున్న న్యాయ పోరాటానికి పార్టీలకతీతంగా మద్దతిస్తామని వైసిపి, టిడిపి, జనసేన, సిపిఎం, సి పి ఐ నాయకులు, సర్పంచులు, ఎంపిటిసిలు స్పష్టం చేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక ఆర్ఒబి వద్ద మిమ్స్ ఉద్యోగులు,కార్మికులు చేస్తున్న పోరాటం మంగళవారానికి 34వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా మిమ్స్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) సంఘీభావ సభ శిబిరం వద్ద జరిగింది. అన్ని పార్టీల నుంచి ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఎంపిటిసిలు, నాయకులు హాజరై మాట్లాడారు. వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములు నాయుడు, డిసిసిబి వైస్ చైర్మన్ చనుమల్ల వెంకటరమణ, నగర పంచాయతీ చైర్ పర్సన్ బంగారు సరోజినీ, వైస్ చైర్మన్లు సముద్రపు రామారావు, కారుకొండ కృష్ణ, వైసిపి పట్టణ అధ్యక్షులు చిక్కాల సాంబశివరావు, టిడిపి మండల అధ్యక్షులు కడగల ఆనంద్, పూసపాటిరేగ ఎఎంసి చైర్‌పర్సన్ చిక్కాల అరుణకుమారి, చిక్కాల సంతోష్ చిక్కాల సుమతి , టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, తుమ్మల పేట పిఎసిఎస్ అధ్యక్షులు కోట్ల పైడి నాయుడు, కౌన్సిలర్లు అవనాపు సత్య నారాయణ, మజ్జి అన్నపూర్ణ, నరవ రామలక్ష్మి, మైపాడ ప్రసాద్, బూర సుజాత, కింతాడ కళా వతి, నాయకులునల్లి చంద్రశేఖర్, నాయకులు లెంక అప్పలనాయుడు, రాజి నాయుడు, సత్యనారాయణ, జనసేన నాయకులు నాని, శ్యామల రావు, సిపిఎం నాయకులు కిల్లంపల్లి రామారావు, సిపిఐ నాయకులు మొయిధ పాపారావు, అడ్వకేట్ కె.సన్యాసిరావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.గోపాలం, సిఐటియు నాయకులు బి.సుధారాణి, సురేష్, పలు గ్రామాలకు చెందిన సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొని మద్దతు తెలిపారు. ఉద్యోగులు చేస్తున్న పోరాటానికి అండగా ఉంటామని ప్రకటించారు. ముఖ్యంగా సంఘం అనేది ఉద్యోగుల హక్కు అని, దాన్ని వద్దంటూ మిమ్స్ యాజమాన్యం మొండిగా వ్యవహరించడం తగదని అన్నారు. యాజమాన్యం వెంటనే సానుకూల వాతావరణంలో చర్చలు జరిపి మిమ్స్ ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని అన్నారు. లేదంటే భవిష్యత్తులో మిమ్స్ ఉద్యోగులు, కార్మికులు నిర్వహించే పోరాటాలకు తాము కూడా మద్దతు ఇచ్చి వారి వెంటే ఉంటామని ప్రకటించారు.

పోరాటం ఉధృతం

మిమ్స్ యాజమాన్యం స్పందించి వెంటనే సమస్యలు పరిష్కరించకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని మిమ్స్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు టివి రమణ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ హెచ్చరించారు. నిరసన శిబిరం నుంచి డైట్ కాలనీ వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ యాజమాన్యం మొండి వైఖరి వీడి ఉద్యోగులు, కార్మికులు కు జనవరి నెల జీతాలు చెల్లించి, 7 డిఎల బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అలా కాని పక్షంలో పోరాటాన్ని జిల్లా వ్యాప్తంగా ఉదతం చేస్తామని తెలిపారు. జనవరి నెల జీతాలు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టడం వారికి ప్రభుత్వం అధికారులు వత్తాసు పలకడం సమంజసం కాదని అన్నారు. మిమ్స్ ఉద్యోగులకు, కార్మికులకు ప్రజాసంఘాలు, సిఐటియు కార్మికులు అండగా నిలిచి యాజమాన్యం దిగి వచ్చే వరకు వారి పక్షాన పోరాటం చేస్తారని స్పష్టం చేశారు. నిరసన శిబిరానికి నగర పంచాయతీ 7వవార్డు కౌన్సిలర్ మైపాడ ప్రసాద్ 10వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు.



రాస్తారోకోను ఉద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు నాయకులు టివి రమణ



బ్లడ్‌బ్యాంకు ను ప్రారంభించిన అనంతరం మాట్లాడుతున్న మంత్రి బొత్స

రక్తదానం ప్రాణదానంతో సమానం

- రాష్ట్ర విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ
- చీపురుపల్లిలో రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకు ప్రారంభం

ప్రజాశక్తి-చీపురుపల్లి

రక్తదానం చేయడం ప్రాణదానంతో సమానమని రాష్ట్ర విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. చీపురుపల్లిలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో కొత్తగా ఏర్పాటు చేసిన బ్లడ్ బ్యాంకును ఆయన మంగళవారం ప్రారంభించారు. అరవిందో ఫార్మా ఫౌండేషన్ సమకూర్చిన రూ.90లక్షలు సిఎస్ఆర్ నిధులతో ఈ బ్లడ్‌బ్యాంకును నిర్మించారు. అవసరమైన పరికరాలను కూడా అందజేశారు. సామాజిక బాధ్యత నిధులతో బ్లడ్‌బ్యాంకును నిర్మించిన అరబిందోను ఈ సందర్భంగా మంత్రి అభినందించారు. అరబిందో చేస్తున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు. ఈ బ్లడ్ బ్యాంకు వల్ల ఏడాదికి సుమారు 3వేల మందికి సకాలంలో రక్తాన్ని అందించి ప్రాణాలు నిలిపేందుకు ఆస్కారం కలుగుతుందని చెప్పారు. కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపి బెల్లాన చంద్రశేఖర్, డిసిహెచ్ఎస్ గౌరీశంకర్, ఆర్‌డిఒ బి.శాంతి, జెడ్‌పిటిసి వలిరెడ్డి శిరీష, వైసిపి మండల పార్టీ అధ్యక్షుడు ఇప్పిలి అనంతం, జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసరావునాయుడు, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నాయక్, అరబిందో ఫార్మా ఫౌండేషన్ వైస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె.నిత్యానందరెడ్డి, డైరెక్టర్ పి.శరత్ చంద్రారెడ్డి, రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షులు కెఆర్‌డి ప్రసాద్, కార్యదర్శి కె.సత్యం, మేనేజింగ్ కమిటీ సభ్యులు బివి గోవిందరాజులు, రెడ్డి రమణ, సర్పంచ్ ఎం.సుధారాణి తదితర స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ఫంక్షన్ హాళ్లు గ్రామాల్లో ఏర్పాటు ముదావహం

రామభద్రపురం : గ్రామాల్లో ఫంక్షన్ హాళ్లు ఏర్పాటు చేయడం ముదావహం అని రాష్ట్ర విద్యా శాఖామంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. కొట్టక్కి గ్రామంలో మాజీ ఎంపిపి అప్పి కొండ శ్రీరాములునాయుడు కుటుంబ సభ్యులు,గ్రామస్తుల సహకారంతో నిర్మించిన ఎఎస్ఎన్ కళ్యాణ మండపాన్ని మంత్రి బొత్స, ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర, ఎంపి బెల్లాన చంద్ర శేఖర్, స్థానిక ఎమ్మెల్యే ఎస్వి చిన అప్పలనాయుడుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అప్పికొండ సత్యం నాయుడు,శాంతమ్మల పేరుతో విశాలమైన భవనాన్ని అన్ని వసతులతో నిర్మించి గ్రామస్తులకు తన చేతుల మీదుగా అంకితం చేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపిపి చొక్కాపు లక్ష్మణరావు, వైసిపి మండల నాయకులు పాల్గొన్నారు.

కెమికల్ డిజాస్టర్‌పై మాక్ డ్రిల్‌కు సన్నద్ధం

మాక్ డ్రిల్ నోడల్ అధికారి ఆర్‌డిఒ సూర్య కళ

ప్రజాశక్తి-విజయనగరం

ఈనెల 7న మైలాన్ లాబొరేటరీస్ వద్ద నిర్వహించనున్న కెమికల్ డిజాస్టర్ మాక్ డ్రిల్ కోసం సర్వం సిద్ధం చేసినట్లు మాక్ డ్రిల్ నోడల్ అధికారి ఆర్‌డిఒ సూర్య కళ తెలిపారు. మాక్ డ్రిల్ పై డైరెక్టర్ అఫ్ ఫ్యాక్టరీస్ వర్మ, స్టేట్ డిజాస్టర్ మేనేజ్మెంట్ అథారిటీ డైరెక్టర్ కూర్మనాథ్ వెబెక్స్ ద్వారా 17జిల్లాల నోడల్ అధికారులతో మాట్లాడారు. విధి విధానాలపై పలు సూచనలు చేసారు. జిల్లాల వారీగా మాక్‌డ్రిల్‌పై చేసిన ఏర్పాట్లపై సమీక్షించారు. జిల్లా నుంచి ఆర్‌డిఒ మాట్లాడుతూ ఈ నెల 7న మైలాన్ లాబొరేటరీస్ వద్ద అమ్మోనియా గ్యాస్ లీకేజ్‌పై చోడమ్మ అగ్రహారం గ్రామం వద్ద మాక్ డ్రిల్ చేయనున్నామని, అక్కడి ప్రజలకు అవగాహన కలిగించేందుకు బుధవారం అన్ని శాఖల అధికారు లతో గ్రామంలో సమావేశం ఏర్పాటు చేసామని తెలిపారు. మల్టీ డిపార్టుమెంటు టాస్క్ ఫోర్సు బృందాలను ఏర్పాటు చేసామని, మాక్‌డ్రిల్ కోసం అవసరమైన సామాగ్రి, వాహనాలను ఎమర్జెన్సీ రెస్పాన్స్ బృందాలను సిద్ధం చేశామని తెలిపారు. మాక్‌డ్రిల్ కోసం ఆహారం, తాగునీరు, టాయిలెట్స్ తదితర ఏర్పాట్లను చేశామన్నారు. చోడమ్మ అగ్రహారం నుంచి 60మందిని ఖాళీ చేయించడానికి ఏర్పాటు చేసామని, బాధితులకు ట్రీట్మెంట్ కోసం దగ్గరలో నున్న ఆసుపత్రిని గుర్తించినట్లు తెలిపారు. రెడ్‌క్రాస్ సొసైటీ, స్వచ్ఛంద సంస్థలు, ఆపదమిత్ర వాలంటీర్లను, అంగన్వాడీ కార్యకర్తలు, డ్వాక్రా బృందాలను మాక్‌డ్రిల్‌లో పాల్గొనేలా చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డిఆర్ఒ అనిత, పిసిబి ఇఇ సరిత, చీఫ్ ఇన్స్పెక్టర్ అఫ్ ఫ్యాక్టరీస్ నారాయణ, డిఎంహెచ్ఒ డాక్టర్ భాస్కర రావు, పోలీస్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

మెకానికల్ ఇంజినీరింగ్‌తో ఉజ్వల భవిష్యత్తు

జెఎన్‌టియు వైస్ ఛాన్సలర్ వెంకటసుబ్బయ్య



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న విసి వెంకట సుబ్బయ్య

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మెకానికల్ ఇంజినీరింగ్ ద్వారా ఉజ్వల భవిష్యత్తు ఉందని జెఎన్ టియు వైస్ ఛాన్సలర్ కె.వెంకటసుబ్బయ్య అన్నారు. రెండు రోజులు పాటు జరిగిన 12వ మెకానికల్ ఇంజినీరింగ్ సెమినార్ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నేడు ప్రపంచంలో మంచి క్రేజ్ ఉన్న సబ్జెక్ట్, ఆదరణ, ఉపాధి అవకాశాలు ఉన్న విభాగం అన్నారు. సెమినార్లు ద్వారా నేర్చుకున్న విషయాలను ప్రయోగాత్మకంగా ఉపయోగించినప్పుడు మంచి అనుభవంతో పాటు ఆ సబ్జెక్ట్ నిపుణులు కావడానికి ఆస్కారం ఉంటుందన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా నేర్చుకున్న అంశాలను జోడించినపుడు నూతన ఆవిష్కరణలు వస్తాయన్నారు. అనంతరం వివిధ అంశాల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు,



హెడ్ కానిస్టేబుల్ కృష్ణమూర్తిని అభినందిస్తున్న ఎస్‌పి ఎం.దీపిక

జాతీయ అథ్లెటిక్స్‌లో కృష్ణంనాయుడుకు పతకాలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఇటీవల మహారాష్ట్ర పూణేలో జరిగిన 44వ జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌క్రీడా పోటీల్లో విజయనగరం రూరల్ పోలీసు స్టేషనులో హెడ్ కానిస్టేబులుగా పని చేస్తున్న వి.కృష్ణం నాయుడు విశేష ప్రతిభ కనబర్చి మూడు బంగారు, ఒక రజతం ఒక కాంస్య పతకం సాధించారు. జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన వి.కృష్ణం నాయుడు మంగళవారం జిల్లా ఎస్‌పి ఎం.దీపికను మర్యాద పూర్వకంగా కలవగా ఆయనను అభినందించారు. కృష్ణమూర్తి క్రీడల పట్ల ఎంతో ఆసక్తితో సాధన చేసి, జాతీయ స్థాయిలో పతకాలు సాధించడం చాలా గొప్ప విషయమని అన్నారు. 800 మీటర్లు, 1500 మీటర్లు, 4X400 మీటర్లు రిలే పరుగులో మూడు బంగారు పతకాలు, 4X400 మీటర్లు రిలే పరుగులో రజత పతకం, 800 మీటర్ల పరుగులో కాంస్య పతకం సాధించారని ఎస్‌పి తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తిని రూరల్ సిఐ ఎం.శ్రీనివాసరావు, స్పెషల్ బ్రాంచ్ సిఐ కెకెవి విజయనాథ్, రూరల్ ఎస్ఐ ఆర్. వాసుదేవ్ తదితరులు అభినందించారు.

నిరంతర సాధనతోనే విజయసోపానం

టెన్త్ విద్యార్థుల అవగాహన సదస్సులో యండమూరి వీరేంద్రనాథ్





విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న యండమూరి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్న తపనతో నిరంతరం శ్రమించడం ద్వారానే విజయ సోపానాలు చేరుకోవచ్చని ప్రముఖ రచయిత, మనస్తత్వవేత్త యండమూరి వీరేంద్రనాథ్ అన్నారు. మంగళవారం ఆనందగజపతి ఆడిటోరియంలో నగరపాలక సంస్థ విద్యా కమిటీ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి రూపొందించి ఆధ్వర్యాన జరిగిన ఈ సదస్సులో యండమూరి వీరేంద్రనాథ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పదో తరగతి పరీక్షలకు ఏ విధంగా సన్నద్ధం కావ్వాలో సోదాహరణగా వివరించారు. జీవితంలో ఉన్నత శిఖరాలు చేరుకోవడానికి, పోటీ పరీక్షలను తట్టుకొని విజేతగా నిలవడానికి తనదైన శైలిలో అవగాహన కల్పించారు. శ్రమ, పట్టుదల, క్రమశిక్షణ జీవిత విజయాలకు సోపానాలని అన్నారు. జీవితంలో 10వ తరగతి అత్యంత ప్రధానమైనదని అన్నారు. ఉన్నత విద్యను అభ్యసించేందుకు పదవ తరగతి మార్కులే ప్రామాణికమని అన్నారు. అధిక మార్కులు సాధించడానికి సలహాలు, సూచనలు చేశారు. తల్లిదండ్రుల ఆశయాలను ఆకాంక్షలను అనుగుణంగా బాగా చదువుకుని జీవితంలో పైకి ఎదగాలని అన్నారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, విద్యా కమిటీ సభ్యులు బాలి పద్మావతి, తాళ్లపూడి సంతోషి కుమారి, తొగురోతు సంధ్యారాణి, ఎంఇఒలు రాజు, సత్యవతి, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు బకాయిలు చెల్లించాలి

కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జీతాలు, ఆరోగ్య భృతి బకాయిలు చెల్లించాలని, పారిశుధ్య కార్మికులకు రూ.21వేలు, డ్రైవర్లకు రూ.24500 బేసిక్ వేతనం అమలు చేయాలని , విలీన ప్రాంత కార్మికులకు వర్తింపచేయాలని కోరుతూ ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో కార్పొరేషన్ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.జగన్మోహన్‌రావు, నాయకులు బొగ్గు భాస్కరరావు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు ఒక్కొక్కరికి మూడు నెలల అలవెన్సు రూ. 18వేలు , పంప్ హౌస్ కార్మికులకు, లీకులు, వాల్ ఆపరేటర్లు, ప్లాంటేషన్, ఆఫీస్ సబార్డినేట్, కంప్యూటర్ ఆపరేటర్‌లకు ఐదు నెలల బకాయి జీతాలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. నెలల తరబడి జీతాలు చెల్లించకపోతే కార్మికులు ఎలా బతకాలని ప్రశ్నించారు. విలీన పంచాయతీలో పనిచేస్తున్న కార్మికులకు రూ. 21వేలు జీతం అమలు చేయాలని అధికారులను కోరారు. జీతాలు, హెల్త్ అలవెన్స్ బకాయిలు చెల్లించేంతవరకు దశలవారీగా పోరాటం చేస్తామని ప్రకటించారు. అనంతరం అసిస్టెంట్ కమిషనర్ ను ప్రజారోగ్య అధికారిని కలిసి వినతి అందజేశారు. ధర్నాలో నాయకులు రజిని, రాఘవ, రమా,కుమారి, లక్ష్మణ, తిరుమల, వంశీ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

వైసిపిలో చేరిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి అందిస్తున్న ప్రజారంజక పాలన, పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులై అనేకమంది వైసిపీలో చేరుతున్నారని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం సుజాత ఫంక్షన్ హాలులో జిల్లా యాదవ సంఘం నాయకులు, టిడిపి నాయకులు మన్యాల కృష్ణతో పాటు ఆ పార్టీకి చెందిన 125 కుటుంబాలు కోలగట్ల, మజ్జిశ్రీనివాసరావు ఆధ్వర్యాన వైసిపిలో చేరారు. ఈ సందర్భంగా కోలగట్ల మాట్లాడుతూ మన్యాల కృష్ణ తమ పార్టీలో చేరడంతో మరింత బలం చేకూరినట్లు అయిందని అన్నారు. రానున్న ఎన్నికలలో వైసిపి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు. ఎంపి బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమానికి ఆకర్షితులై అనేకమంది ఇతర పార్టీలను వీడి వైసిపిలో చేరుతున్నారన్నారు. మన్యాల కృష్ణ మాట్లాడుతూ 46ఏళ్ల పాటు తెలుగుదేశంలో ఉండి ఎంతో సేవ చేశానని, అయినప్పటికీ తమ సామాజిక వర్గానికి గుర్తింపు లేదని అన్నారు. యాదవ కులానికి ఏదీ సాధించలేకపోయానన్న మనస్థాపంతోనే పార్టీ మారాల్సి వచ్చిందని చెప్పారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ లయ యాదవ్, కార్పొరేటర్లు ఇసరపు రేవతి దేవి, పొంతపల్లి మాలతి, బొద్దాన అప్పారావు, గదుల సత్యలత, యాదవ సంఘం నాయకులు బమ్మిడి అప్పలస్వామి, గండబోయిన శంకర్, పల్లి అప్పలస్వామి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు బియ్యం పంపిణీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు, కెఆర్ హెల్పింగ్ హాండ్స్ ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బి.కాంతారావు ఆధ్వర్యంలో మంగళవారం కార్పొరేషన్ కార్యాలయం వద్ద 600 మంది పారిశుధ్య కార్మికులకు ఉచిత బియ్యం పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ట్రస్టు చైర్మన్ కాంతారావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ స్ఫూర్తితో కెఆర్ హెల్పింగ్ హాండ్స్ ఛారిటబుల్ ట్రస్ట్ అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించి గత ఎనిమిది నెలలుగా పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు.కరోనా కష్టకాలంలో రాష్ట్రంలో పారిశుధ్య కార్మికులు ప్రాణాలు తెగించి సేవలందించారని తెలిపారు. ఈనేపథ్యంలోనే వారందరికీ ఉచిత బియ్యం పంపిణీ కార్యక్రమం చేపట్టామన్నారు. కార్యక్రమంలో చైర్మన్ సతీమణి కల్పనా నాయుడు, ముద్దాడ మధు, యాత కార్పొరేషన్ చైర్మన్ పిల్లి నూకరాజు, నాలుగో వార్డు కార్పొరేటర్ వజ్రపు శ్రీను, ఎనిమిదవ వార్డు కార్పొరేటర్ దూదాసు వేణు, యాత కార్పొరేషన్ డైరెక్టర్ అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకూ పోరాడుతాం

- సిపిఎం జిల్లాకార్యదర్శి తమ్మినేని
- రెండోరోజుకు చేరిన రిలే నిరాహారదీక్షలు



నిరాహారదీక్షను ఉద్దేశించి మాట్లాడుతున్న తమ్మినేని సూర్యనారాయణ

ప్రజాశక్తి-మెంటాడ

అనేక ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూములకు సాగు హక్కు కల్పించకుండా ప్రజాప్రతినిధులు, అధికారులు అన్యాయం చేయడం దారుణమని సిపిఎంజిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ అన్నారు. సమస్యలు పరిష్కరించేవరకు వివిధ రూపాల్లో పోరాడుతామని హెచ్చరించారు. గిరిజనులు, దళితులు,పేదల సాగులో ఉన్న భూములకు ప్రభుత్వం పట్టాలివ్వాలని డిమాండ్ చేస్తూ ఎపి ఆదివాసీ గిరిజన సంఘం, ఎపి వ్యవసాయ కార్మికసంఘం ఆధ్వర్యాన స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన రిలే నిరాహారదీక్షలు మంగళవారం రెండోరోజుకు చేరాయి. దీక్షలకు సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్తించి భూములకు కూడా పట్టాలు ఇవ్వకుండా ఏళ్ల తరబడి మీనమేషాలు లెక్కించడం హక్కులను హరించడమేనని అన్నారు. మెంటాడ మండలం షెడ్యూల్ ఏరియాలో లేనందున మరింత అన్యాయానికి గిరిజనులకు గురవుతున్నారని తెలిపారు. సమస్యను పరిష్కరించాల్సిన బాధ్యత కలిగిన మంత్రి పట్టాలు ఇవ్వకుండా ధర్నాలను, పోరాటాలను అవహేలనచేయడం క్షమించరానిదని అన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు కార్పొరేట్ కంపెనీలకు, భూస్వాములకు సేవ చేయడానికి ఉన్నారా? పేదలకు సేవ చేయడానికి ఉన్నారా? తేల్చి చెప్పాలని అన్నారు. పేదలకు ఐక్య పోరాటమే బలమని పట్టాలు సాధించుకునే వరకు, మన భూములు మన చేతుల్లోకి వచ్చేవరకు, షెడ్యూల్ ఏరియాలో చేర్చేంతవరకు పోరాటం కొనసాగించాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాస్. ఆదివాసి గిరిజన సంఘం మండల కార్యదర్శి తామరాపల్లి సోములు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎం.అప్పల నరసయ్య, కౌలు రైతు సంఘంజిల్లా అధ్యక్షులు రాకోటిరాములు, నిరుపేద నాయకులు నాగేశ్వరరావు, మురళి తదితరులు దీక్షలో పాల్గొన్నారు.

రజకులకు రక్షణ చట్టం చేయాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రజకులపై జరుగుతున్న దాడుల నుంచి రక్షణ కోసం చట్టం చేయాలపి ఎపి రజక సంఘం జిల్లా చైర్మన్ అప్పికొండ సన్యాసిరావు డిమాండ్ చేశారు. మంగళవారం ఆసంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు తంగేటి భాస్కరరావు ఆధ్వర్యంలో జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. జిల్లా చైర్మన్‌గా సన్యాసిరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రజకులపైన దాడులు, దౌర్జన్యాలు, సాంఘిక బహిష్కరణల నుంచి కాపాడేందుకు రక్షణ చట్టం చేయాలని కోరారు. జిల్లా కార్యదర్శి జంప చిన్న, జాయింట్ సెక్రటరీ చిట్టిబాబు పాల్గొన్నారు.

భోగాపురంలో సిఎం ఏరియల్ సర్వే

ప్రజాశక్తి - భోగాపురం


పనులను పరిశీలిస్తున్న సిఎం

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణ పనులను రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఏరియల్ వ్యూ ద్వారా మంగళవారం పరిశీలించారు. విశాఖ పర్యటనకు వచ్చిన ఆయన జిఎంఆర్ సంస్థ ప్రతినిధులతో కలిసి ఈ పనులను హెలికాప్టర్‌లో నుంచి పరిశీలించారు. ముఖ్యంగా విమానాశ్రయం చుట్టు నిర్మించిన ప్రహరీ గోడ, భూములను చదును చేసి చేస్తున్న నిర్మాణ పనులను పరిశీలించారు. జిఎంఆర్ సంస్థ ప్రతినిధులు పనులకు సంబంధించిన వివరాలను ఆయనకు వివరించారు.

మానవ మనుగడకు ఔషధ మొక్కలు కీలకం

నెల్లిమర్ల: మన పూర్వీకులు అందించిన అద్భుతమైన వైద్యం మన పరిసరాల ప్రాంతంలో ఉన్న ఔషధ మొక్కలేనని ఆయుర్వేదిక్ సీనియర్ వైద్యులు డాక్టర్ రవి వర్మ తెలిపారు. మంగళవారం విజయనగరం పూల్ బాగ్ భారత్ స్కౌట్స్ అండ్ గైడ్ ప్రాంతీయ శిక్షణ కేంద్రంలో ఉత్తరాంధ్ర అడ్వాన్స్ గైడ్ స్కౌట్ శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులు హైక్‌లో భాగంగా సారిపల్లి చంపావతి నది దగ్గర ఉన్న రవివర్మ ఆయుర్ విలేజ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన పునర్జన్మను ప్రసాదించే మొక్కలు ఈ ప్రకృతిలో ప్రతి చోట విరివిగా లభిస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులు, ఆయుర్ విలేజ్ సిబ్బంది పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలో 73మంది ఎంపిక

బొబ్బిలి: రాజా కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో 73మంది ఎంపికయ్యారు. రాజా కళాశాలలో హెటిరో డ్రగ్స్ పరిశ్రమ యాజమాన్యం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలకు 95మంది విద్యార్థులు హాజరవ్వగా 73మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఎంఎస్‌సి కెమిస్ట్రీ పూర్తి చేసిన విద్యార్థులు 42మంది, బిఎస్‌సి కెమిస్ట్రీ పూర్తి చేసిన విద్యార్థులు 31మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. క్యాంపస్ ఇంటర్వ్యూలో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను యాజమాన్య ప్రతినిధి రావు బదరి, ప్రిన్సిపాల్ సిహెచ్ వీరేంద్రకుమార్, ప్లేస్మెంట్ అధికారి శరత్ కుమార్ అభినందించారు.

సచివాలయాలు తనిఖీ

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధిలో మొయిద జంక్షన్-1, అగురు వీధి, పద్మశాలి వీధి సచివాలయాలను నగర పంచాయతీ కమిషనరు పి.బాలాజీ ప్రసాద్ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఈబిసి నేస్తం, అమ్మఒడి, నవరత్నాలు పేదలందరికి గృహ పథకం సంబంధించిన ఇకెవైసి పూర్తి చేయడం, ఆరోగ్య శ్రీ కార్డులను పంపిణీ చేయడం, ఆరోగ్య శ్రీ కార్డుల మిస్సింగ్ క్యాప్చర్ చేయించడం, ఈ నెల 31లోగా ఆస్తి, ఖాళీ స్థలం, నీటి పన్నులను శత శాతం వసూలు చేయాలని సచివాలయ సిబ్బందికి ఆదేశించారు. కొండవెలగాడలో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన నవరత్నాలు పేదలందరికి ఇళ్లకు రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేసే కార్యక్రమానికి లబ్దిదార్లు హాజరవ్వడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.

టెన్త్ విద్యార్థులకు అభినందనలు

బొబ్బిలి: పదో తరగతి ప్రీ ఫైనల్ పరీక్షలలో ఆంగ్లంలో 90 శాతం మార్కులు సాధించిన విద్యార్థులను విశ్రాంతి ఉపాధ్యాయులు గంగాధర్ మెడల్స్‌తో అభినందించారు. గొల్లపల్లి శ్రీవేణుగోపాల మున్సిపల్, ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. పదో తరగతి పరీక్షలు బాగా రాయాలని కోరుతూ విద్యార్థులను అభినందించినట్లు గంగాధర్ చెప్పారు. విద్యార్థుల భవిష్యత్తుకు పునాది పదోతరగతి అని బాగా చదివి భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యాత్రికులకు అసౌకర్యం కలగకుండా చూడాలి

శృంగవరపుకోట రూరల్: మహ శివరాత్రి సందర్భంగా పుణ్యగిరి కొండపై గల ఉమా కోటిలింగేశ్వర దేవాలయానికి వచ్చే యాత్రికుల కోసం నిర్వహించే ఏర్పాట్లపై పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ ఎస్ కిరణ్ కుమార్ అధ్యక్షతన మంగళవారం వివిధ శాఖల మండల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని ధర్మవరం సన్యా సేశ్వర స్వామి దేవాలయానికి, ఎస్ కోట పుణ్యగిరి ఉమా కోటి లింగేశ్వర స్వామి దేవాలయానికి వచ్చే యాత్రికులకు ఏ విధమైన అసౌకర్యమూ కలగకుండా మెడికల్ అండ్ హెల్త్, పంచాయతీరాజ్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, పోలీస్, పంచాయతీ కార్యాలయం, దేవాదాయశాఖ, ఆర్‌టిసి, విద్యుత్ శాఖలన్నీ శాఖల వారీగా ఏర్పాట్లపై ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో ట్రైని ఎఎస్‌పి జావలి, దేవస్థానం చైర్మన్ పోలమర శెట్టి రామకృష్ణ, డైరెక్టర్లు, వివిధ శాఖలకు చెందిన మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపిడిఒ కార్యాలయంలో సిఇఒ తనిఖీ

కొత్తవలస: విజయనగరం జెడ్‌పి సిఇఒ కె. రాజకుమార్ స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. 2022 –23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక తనిఖీ చేసినట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ రాకముందే మిగిలి ఉన్న నిధులతో అభివృద్ధి పనులు ప్రారంభించాలని తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధులు పనులు ప్రారంభించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఎస్. రమణయ్య, ఓఆర్‌డిఒ సిహెచ్‌వి నాయుడు, ఇఒపిఆర్‌డి కె.ధర్మారావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జనసేనలో పలువురు చేరిక

భోగాపురం: మండలంలోని గూడెపు వలస గ్రామానికి చెందిన పలువురు సోమవారం రాత్రి జనసేన పార్టీలో చేరారు. ఆ పార్టీ నాయకులు లోకం ప్రసాద్ ఆధ్వర్యంలో వీరంతా పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. రానున్న రోజుల్లో వైసిపిని ఇంటికి పంపించాలని ప్రసాద్ అన్నారు. ఈ ప్రభుత్వంలో ఏ ఒక్కరు కూడా సంతృప్తిగా లేరని తెలిపారు. అందుకు వచ్చే ఎన్నికల్లో గాజు గ్లాస్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఆయన గ్రామస్తులను కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు బొల్లు త్రినాథ్ పాల్గొన్నారు.

టిడిపి ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి - విజయనగరం కోట

బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా టిడిపి అభ్యర్థి పి.విజయలక్ష్మిగజపతి మంగళవారం 48వ డివిజన్ లో గాజులరేగలో ఇంటింటి ప్రచారం చేపట్టారు. చంద్రబాబు నాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలను ప్రజలకు వివరించారు. వైసిపి పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడే వారిపై అక్రమ కేసులు పెట్టి కక్ష సాధింపు రాజకీయాలు చేయడం తప్ప ప్రజలకు చేసిన మంచి ఏమి లేదని అన్నారు. పరిపాలన చేతకాని అసమర్థ ముఖ్యమంత్రి వలన రాష్ట్రం అప్పులపాలై ఉద్యోగులకు జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి, చివరకు రాష్ట్ర సచివాలయాన్ని కూడా తాకట్టు పెట్టిన అసమర్థ ప్రభుత్వమని విమర్శించారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తారన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలినాయుడు, కార్యాలయ కార్యదర్శి రాజేష్ బాబు, నాయకులు వేచలపు శ్రీనివాసరావు, అవనాపు విజయ్, పిల్లా విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాటుసారాతో వ్యక్తి అరెస్టు

గుర్ల: మండలంలోని పెదబంటుపల్లి గ్రామంలో నాటుసారా అమ్ముతున్న వ్యక్తిని మంగళవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు దాడులు నిర్వహించి ఒక వ్యక్తి నుండి 18 లీటర్లు నాటుసారాను స్వాధీనం చేసుకుని, అతన్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ భాస్కర్ రావు తెలిపారు. గ్రామాలలో ఎవరైనా నాటు సారా, అక్రమ మద్యం అమ్మకాలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పోక్సో కేసులో రెండేళ్లు జైలు

ప్రజాశక్తి - విజయనగరం కోట

తెర్లాం పోలీసు స్టేషన్‌లో 2021లో నమోదైన పోక్సో కేసులో నెమలాం గ్రామానికి చెందిన గొట్టివాద ఈశ్వరరావు(20)కు విజయనగరం పోక్సో ప్రత్యేక న్యాయమూర్తి కె. నాగమణి రెండేళ్ల జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధించారని తెర్లాం ఎస్ఐ రమేష్‌కుమార్ మంగళవారం తెలిపారు. గొట్టివాద ఈశ్వరరావు ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న బాలిక వెంట పడి ఇబ్బంది పెట్టడంతో బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ నవీన్ పడాల్ కేసు నమోదు చేశారన్నారు. కేసు దర్యాప్తు చేసి సాక్ష్యాధారాలను కోర్టుకు హాజరు పర్చడంతో నేరారోపణలు రుజువైనందున ఆయనకు కోర్టు తీర్పు ఇచ్చినట్లు వెల్లడించారు. ఈ కేసును పబ్లిక్ ప్రాసిక్యూటర్ మామూరి శంకరరావు వాదించినట్లు తెలిపారు.

విమానాశ్రయ నిర్మాణానికి తాత్కాలిక విద్యుత్

- ఆ శాఖకు రూ.2కోట్లు చెల్లించిన నిర్మాణ సంస్థ
- 5000 కెవి సామర్థ్యంతో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు సన్నాహాలు
- సరఫరాకు కొత్త లైన్లు పనులు ప్రారంభం

ప్రజాశక్తి - భోగాపురం

అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణానికి సంబంధించి తాత్కాలికంగా విద్యుత్‌ను సరఫరా చేసేందుకు పనులు ప్రారంభమయ్యాయి. ఈ మేరకు గత రెండు రోజులు నుంచి ఈ పనులు జరుగుతున్నాయి. ఇందుకోసం విమానాశ్రయ నిర్మాణ సంస్థ రూ.2కోట్లను విద్యుత్‌శాఖకు చెల్లించినట్లు సమాచారం. విమానాశ్రయం నిర్మాణ పనులు పూర్తయ్యేలోపు ముఖ్యాం వెళ్లే రహదారిలో రామచంద్రపేట వద్ద కేటాయించిన స్థలంలో సబ్‌స్టేషన్‌ను నిర్మించనున్నారు. దీని కోసం రెవెన్యూ అధికారులు స్థలాన్ని కూడా కేటాయించారు. ప్రస్తుతం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణ పనులు 2200 ఎకరాల్లో గత కొన్ని రోజులు నుంచి శరవేగంగా జరుగుతున్నాయి. కాని ఇంత వరకు విద్యుత్ సరఫరా లేక జనరేటర్స్‌తో పనులు జరుగుతున్నాయి. ఇటీవలి నిర్మాణ సంస్థ 2కోట్లు రూపాయలను ఎపిఇపిడిసిఎల్ సంస్థకు విద్యుత్ సరఫరా కోసం చెల్లించింది. దీంతో జాతీయ రహదారిలోని ఏ.రావివలస జంక్షన్‌లో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి సరఫరా చేసేందుకు నిర్ణయించారు. అక్కడ నుంచి విద్యుత్ స్తంబాలు వేసి కొత్త లైను ఇవ్వనున్నారు. ఇందుకోసం విద్యుత్


ఎ.రావివలస వద్ద ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు తవ్విన గోయ్యి

సబ్‌స్టేషన్‌లో 5000కె.వి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్నారు. దీనికి సంబంధించిన పనులు కూడా సబ్‌స్టేషన్‌లో జరుగుతున్నాయి.

ప్రజలకు తప్పని విద్యుత్ ఇబ్బందులు

విద్యుత్ సరఫరా చేసేందుకు పనులు జరుగుతుండడంతో గత రెండు రోజులు నుంచి ఏ.రావివలస కూడలి నుంచి చేపలకంచేరు వెళ్లే రహదారిలోని వివిధ గ్రామాలకు విద్యుత్ కష్టాలు ఏర్పడ్డాయి. విద్యుత్ లైన్లు వేస్తుండడంతో ప్రస్తుతం అప్పుడప్పుడు విద్యుత్‌ను నిలుపుదల చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో ఏ.రావివలస, దల్లిపేట, గూడెపువలస, బైరెడ్డిపాలెం, చేపలకంచేరు, రెడ్డికంచేరు పంచాయతీల్లోని వివిధ గ్రామలకు ఈ విద్యుత్ సమస్యలు ఏర్పడనున్నాయి.

విద్యుత్ సరఫరాకు పనులు ప్రారంభించాం

విమానాశ్రయ నిర్మాణానికి విద్యుత్ సరఫరా చేసేందుకు పనులు ప్రారంభించాం. ఏ.రావివలస కూడలిలోని సబ్‌స్టేషన్‌లో 5000 కె.వి కెపాసిటీతో ట్రాన్స్‌ఫార్మర్ వేస్తాం. దీనికి సంబంధించిన సొమ్మును కూడా నిర్మాణ సంస్థ చెల్లించింది. కొత్తగా విద్యుత్ లైను వేస్తున్నందున ప్రజలకు కొంత విద్యుత్ సమస్యలు ఉంటాయి. అయినప్పటికీ వారికి ఇబ్బందులు లేకుండా పనులు చేస్తున్నాం. - **మస్తాన్ వలి, విద్యుత్ శాఖ ఎఇ, భోగాపురం**

పంచాయతీ కార్మికుల నిరసన

ప్రజాశక్తి - గజపతినగరం

మండలంలోని పురిటిపెంట పంచాయతీ కార్మికులకు పెరిగిన ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలని గత ఐదు రోజులుగా పనులు బంద్ చేసి సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా మంగళవారం గజపతినగరం మెయిన్ రోడ్‌లో ర్యాలీ చేసిన అనంతరం చెత్తకుప్పకు పూజా చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యానారాయణ మాట్లాడుతూ రోజుకు రూ. 300 కూలితో బతకడం సాధ్యం కాదని, పెరిగిన ధరలకనుగుణంగా జీతాలు పెంచాలని, పిఎఫ్, ఇఎస్ఐ, హెల్త్ అలెవెన్స్ సౌకర్యం కల్పించాలని, దహన సంస్కరణ ఖర్చు కింద రూ.15 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మికులు ప్రజల ఆరోగ్యం కోసం వాళ్ల ఆరోగ్యాన్ని పణంగా పెట్టి పని చేస్తున్నారని గుర్తు చేశారు. గజపతినగరంలో చెత్త పేరుకు పోవడానికి కారణం


చెత్తకుప్ప వద్ద పూజలు చేస్తున్న నాయకులు, కార్మికులు

పంచాయతీ సెక్రటరీలు, ప్రజాప్రతినిధులేనని అన్నారు. కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి వి లక్ష్మి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి శ్రీనివాస్, డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి నాయుడు, కనకరాజు, నాగేశ్వరరావు, కృష్ణ, కోటి, ఏసు పాల్గొన్నారు.

ఫలించిన చర్చలు

రూ.2వేలు వేతనం పెంచేందుకు అంగీకారం

మంగళవారం సాయంత్రం పంచాయతీ అధికారులు, సర్పంచుల సమక్షంలో సిఐటియు నాయకులతో జరిగిన చర్చలు సఫలమ య్యాయి. అధికారులు సానుకూలంగా స్పందించి రూ.2వేలు వేతనం అదనంగా పెంచడానికి అంగీకరించారు. దీంతో బుధవారం నుంచి వీధుల్లో చేరేందుకు కార్మికులు సమ్మతించారు. ఇప్పటి వరకు రూ.9వేలు ఉన్న జీతం ఇప్పుడు 2000 పెంచడంతో మొత్తంగా రూ.11వేలు అవుతుందని నాయకులు తెలిపారు. ఐదు రోజులు చేసిన సమ్మెకు సహకరించిన సిబ్బందికి, ప్రజలకు ధన్యవాఆలు తెలియజేస్తున్నామని సిఐటియు జిల్లా కార్యదర్శి వి లక్ష్మి, పంచాయతీ కార్మిక నాయకులు కనకరాజు, నాగేశ్వరరావు, కృష్ణ, కోటి, గోవింద తెలిపారు.

ప్రతి కుటుంబానికీ రూ.5వేలు

ప్రజాశక్తి - డెంకాడ

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రతి పేద కుటుంబానికి ప్రతి నెలా రూ. 5వేలు ఆర్థిక సాయంగా అందిస్తామని డిసిసి అధ్యక్షులు సరగడ రమేష్ అన్నారు. మండలం సింగవరం గ్రామంలో మంగళవారం ఇంటింటికి కాంగ్రెస్ పార్టీ ప్రచారం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డెంకాడ, భోగాపురం, పూసపాటిరేగ మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు తెలుగు సూరిబాబు, రమణారెడ్డి, డి గురువులు, నాయకులు రాజు, శ్రీను, రవి, ఆదినారాయణ పాల్గొన్నారు.


కరపత్రాలను పంపిణీ చేస్తున్న రమేష్

ఏళ్లు గడుస్తున్నా పనులు జరగవే..!

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని ఆతవ గ్రామానికి 2011లో రూ. 97.75 లక్షలతో రోడ్డు వేశారు. ప్రస్తుతం ఆ రోడ్డు పూర్తిగా శిథిలావస్తుకు చేరింది. గత వర్షాల కారణంగా రోడ్డు మలుపు వద్ద భయంకరమైన గండి కూడా పడింది. గ్రామం నుండి మండల కేంద్రానికి అత్యవసర సమయాల్లోనూ, విద్యార్థుల విద్యాసంస్థలకు వెళ్లాలంటే ఈ రోడ్డుగుండానే ప్రయాణించి ఇబ్బందులు పడేవారు. ఈ నేపథ్యంలో తమకు రోడ్డు కావాలని ఎమ్మెల్యేను గ్రామస్తులు కోరడంతో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. ఇందులో


రాళ్లు తేలిన ఆతవ రోడ్డు

భాగంగా కాంట్రాక్టర్ రెండేళ్ల క్రితం రోడ్డుని పూర్తిగా తవ్వేసి మెటల్ వేసి వదిలేశారు. దీంతో ప్రయాణికులు మళ్లీ అవస్థలు పడుతున్నారు. దీంతో ఇటీవల జరిగిన మండల పరిషత్తు సర్వసభ్య సమావేశంలో తమ గ్రామానికి వేసిన రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేమయాలని ఆతవ గ్రామస్తులు కోరగా ఇప్పుడు రోడ్డు లేకపోతే నష్టం ఏంటని, సంక్షేమ పథకాలు అందుతున్నాయి కదా అని బదులివ్వడంతో గ్రామస్తులు ఆయనపై గుర్రుగా ఉన్నట్లు తెలిస్తోంది. ఇటువంటి వారికి రానున్న ఎన్నికల్లో ఓటుతోనే బుద్ధి చెప్పాలని గ్రామస్తులు, యువత చర్చించుకుంటున్నట్లు సమాచారం.

హైవే నిర్మాణ పనులతో అనారోగ్యం

ప్రజాశక్తి - రామభద్రపురం

6 లైన్ గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణం కోసం సబ్బవరం నుంచి రాయపూర్ వరకు హెచ్‌జిఇన్‌ఫ్రా ఇంజినీరింగ్ కంపెనీ నిర్మాణాలు చేస్తుంది. వీరు మండల పరిధిలోని కొండ కెంగువ పంచాయతీ ఆవాస గ్రామం జుమ్మువలస వద్ద బేస్ క్యాంప్ ఏర్పాటు కోసం 2 ఏళ్ల కిందట స్థానిక పంచాయతీ అనుమతికి దరఖాస్తు చేసుకొని కేవలం బేస్ క్యాంప్ కార్యాలయానికి మాత్రమే అనుమతులు పొందారు. ప్రస్తుత సర్పంచ్ కంచుపల్లి సుజాత అప్పటి పంచాయతీ పాలకవర్గం తీర్మానం మేరకు మంజూరు చేశారు. అయితే ఈ కంపెనీ వారు తీసుకున్న అనుమతులు అధిగమించి కాలుష్య కారకమైన క్వారీలు, పెట్రోల్ బంకులు, ఇతరత్రా అనధికార యంత్రాలు ఏర్పాటు చేసుకొని వీటితో రాత్రి పగలు పనులు చేయడం వల్ల నిత్యం దుమ్ము, దూలి వ్యాప్తి చెంది


బుగ్గుకు కారణమవుతున్న క్వారీ

గ్రామస్తులు తీవ్ర అనారోగ్యాల పాలవుతుండడంతో గ్రామస్తులు సర్పంచ్‌ను అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. పంచాయతీ తీర్మానం మేరకు అనుమతించిన నిర్మాణాలు ఉంచి మిగతా నిర్మాణాలను తొలగించి గ్రామస్తుల ఆరోగ్యాలు కాపాడాలని కోరుతూ స్థానిక ఎస్ఐ జ్ఞానప్రసాద్‌కు సర్పంచ్ సుజాత ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సుజాత మాట్లాడుతూ స్థానికులకు ఉద్యోగాలు ఇస్తామని, గ్రామాభివృద్ధికి సహాయ పడతామని నమ్మించి అనధికార నిర్మాణాలు చేపట్టారని దీని వల్ల ప్రజలకు అనేక ఇబ్బందులు వస్తున్నాయని అనారోగ్య సమస్యలు పెరుగుతున్నాయని ఆవేదన చెందారు. ఎస్ఐ మాట్లాడుతూ సర్పంచ్, గ్రామస్తుల ఫిర్యాదు మేరకు పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఇంటర్ విద్యార్థిని డిబార్

ప్రజాశక్తి - వంగర

మండలంలోని మడ్డువలసలో ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఇంగ్లీష్ పరీక్షలో చూసి రాతకు పాల్పడిన వంగర కెజిబివి కళాశాల విద్యార్థినిని డిబార్ చేసినట్లు ఆ పరీక్షా కేంద్రం చీఫ్ సూపరిండెంట్ కొరటాన నారాయణరావు మంగళవారం తెలిపారు. చూసి రాతకు పాల్పడిన విద్యార్థిని మిగతా పరీక్షలు రాసేందుకు అనర్హులని స్క్వాడ్ తెలిపినట్లు చీఫ్ సూపరిండెంట్ నారాయణరావు వెల్లడించారు. ఎవరైనా చూసిరాతలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. స్థానిక కెజిబివి కళాశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందకపోవడం వల్లనే విద్యార్థిని సూచిరాతకు పాల్పడుతూ బలై పోవలసిన దుస్థితి ఏర్పడిందని పలువురు చర్చించుకుంటున్నారు.

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం

ప్రజాశక్తి - గుర్ల

బాల్య వివాహాలను నిర్మూలించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని వైసిపి జిల్లా కార్యవర్గ సభ్యులు పొట్నూరు సన్యాసినాయుడు, జెడ్‌పిటిసి శీర అప్పలనాయుడు అన్నారు. మండల పరిషత్ కార్యాలయం సమావేశం భవనంలో ఐసిడిఎస్ పిఒ ఆరుద్ర ఆధ్వర్యంలో బాల్య వివాహాలు నిర్మూలన, బాల్య వివాహాలు నిరోధక కమిటీ ఏర్పాటుపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అవగాహన లేని కారణంగా కొంతమంది తల్లిదండ్రులు ఆడపిల్లలకు బాల్య వివాహాలు చేస్తున్నారని. దీనివల్ల ఆడపిల్లలు మానసికంగా అనారోగ్యాలు బారిన పడుతున్నారని, ఎంతో మంది జీవితాలు నాశనం అవుతున్నాయని అన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలు, బాల్య వివాహాలు చేస్తే పడే శిక్షలపై మండల స్థాయి కమిటీ ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. పిఒ ఆరుద్ర మాట్లాడుతూ బాల్య వివాహాల నిరోధక మండల స్థాయి కమిటీలో తహశీల్దారు, ఎంపిడిఒ, మండల విద్యాశాఖ అధికారి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు ఉంటారని తెలిపారు. గ్రామ పంచాయతీ పరిధిలో సర్పంచ్ చైర్మన్‌గా 9 మందితో కూడిన కమిటీ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి తోట తిరుపతిరావు, తహశీల్దార్ రమాదేవి, ఎపిఒ నారాయణరావు, సూపర్‌వైజర్ శకుంతల, పంచాయతీ కార్యదర్శులు, విఆర్ఒలు తదితరులు పాల్గొన్నారు.

స్వార్థ రాజకీయలు చేస్తున్నారు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - విజయనగరం

వైసిపిలో సముచిత స్థానం కల్పించి స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా పదవిని కట్టబెట్టినప్పటికీ వ్యక్తిగత ద్వేషాలకు పోయి వ్యవస్థనే నాశనం చేయాలని చూసి స్వార్థ రాజకీయాలు చేస్తే నష్టపోయేది వారేనని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు భార్య, కొంతమంది సర్పంచులు, ఎంపిటిసిలతో టిడిపిలో చేరిన నేపథ్యంలో ఆయన మంగళవారం ఎస్‌కోట పట్టణంలోని వైసిపి కార్యాలయంలో ఐదు మండలాల వైసిపి నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ భార్య బొత్స ఝాన్సీ విశాఖ ఎమ్‌పి సీటు కేటాయించారని తెలిసినప్పటికీ గురువుకే వెన్నుపోటు పొడిచే రాజకీయాలు చేస్తున్నారని టిడిపి కండువా వేసుకున్నవారు మరొకసారి పునరాలోచించాలని సూచించారు. పార్టీ వారికి ఎప్పుడూ అండగా ఉండి పార్టీ కోసం కష్టపడే వారికి సముచిత స్థానం కల్పిస్తుందని తిరిగి వైసిపిలోకి చేరిపోతే సాదరంగా గౌరవిస్తామని అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కొప్పల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడు బాబు, వక్ఫ్ బోర్డ్ డైరెక్టర్ వాకాడ రాంబాబు, మాజీ ఎమ్మెల్యే శోభ హైమావతి, వైస్ ఎంపిపి పినిశెట్టి రమణ, వైసిపి మండల అధ్యక్షులు మోపాడ కుమార్, ఐదు మండలాలకు చెందిన వైసిపి జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు, ఎంపిటిసిలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు..

బకెట్లకు ఆశపడితే భవిష్యత్ అంధకారమే

ప్రజాశక్తి - పూసపాటిరేగ

ఎన్నికలు నేపథ్యంలో గ్రామాల్లో పంచుతున్న బకెట్లకు ఆశపడి వారిపట్ల ఆసక్తి చూపితే భవిష్యత్తంతా అందకారంగా మారిపోతుందని నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. నవరత్నాలు, పేదలందరికి ఇల్లు కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదోడి సొంతింటి కళ నేరవేర్చింది వైసిపి ప్రభుత్వమేనన్నారు. మండలం మొత్తం 951 పట్టాలను రిజిస్ట్రేషన్ చేసి పంపిణీ చేసే ఘనత ఈ ప్రభుత్వానిదే అన్నారు. ప్రతి ఇంటికి ఐశ్వర్యం, ఆరోగ్యం, ఆనందం వైసిపితోనే సాధ్యమన్నారు. గడప గడపకు సంక్షేమాన్ని అందిస్తున్న ఘనత మన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిదే అన్నారు. రానున్న ఎన్నికల్లో మనమంతా జగనన్న పక్షాన ఉండి మరలా ముఖ్యమంత్రిగా చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి మహంతి కళ్యాణి, జెడ్‌పిటిసి మహంతి సీతాలక్ష్మి, వైస్ ఎంపిపిలు చంటి రాజు, అల్లాడ రమేష్,


ఇళ్ల పట్టాలను అందిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

మండల పార్టీ అధ్యక్షులు పతివాడ అప్పలనాయుడు, జెసిఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు, రామతీర్ధం ఆలయ బోర్డు సభ్యులు డి. త్రినాదరావు, పిఎసిఎస్ చైర్మన్ మహంతి లక్ష్మణరావు, నాయకులు పుప్పాల లక్ష్మినారాయణ, మహంతి జనార్ధనరావు, స్థానిక సర్పంచి టి. సీతారాం, డి. గణేష్, మొంగం నాగబాబు, రౌతు సాయి, తహశీల్దార్ ప్రవలిక, ఎంపిడిఒ రాధిక సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

నిర్వాసితులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

తారక రామ ప్రాజెక్టులో భాగంగా సర్వం కోల్పోయిన కోరాడ పేట నిర్వాసితులకు న్యాయం చేయాలని పంచాయతీ రాజ్ ఛాంబర్ రాష్ట్ర కార్యదర్శి, మాజీ సర్పంచ్ గేదెల రాజారావు డిమాండ్ చేశారు. మంగళ వారం దన్నాన పేట పంచాయతీ పరిధి తారక రామతీర్థ ప్రాజెక్టు నిర్వాసిత గ్రామం కోరాడ పేటను రెవెన్యు, నీటి పారుదల శాఖ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా గేదెల రాజారావు అధికార్లతో మాట్లాడుతూ కోరాడ పేట రైతుల జిరాయితీ భూములు ప్రభుత్వ భూములుగా తప్పుగా నమోదు చేశారని వాటిని సవరించి రైతులకు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీని వల్ల రైతులకు రైతు భరోసా అందడం లేదన్నారు. నిర్వాసితులకు భూమి చూపించారు గాని ఇంతవరకు పట్టాలు


రెవెన్యూ అధికారికి సమస్యను వివరిస్తున్న గేదెల రాజారావు

ఇవ్వలేదని గుర్తు చేశారు. ప్రాజెక్టు ఆర్ ఆర్ ప్యాకేజీ కింద పాత ఇళ్లకు ఇంతవరకు ప్రభుత్వం నష్ట పరిహారం కూడా చెల్లించలేదని, 2021భూసేకరణ చట్ట ప్రకారం నిరుద్యోగ యువతకు భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు. దీనిపై రెవెన్యు అధికార్లు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో చర్చలు జరిపి పరిష్కా రానికి కృషి చేస్తానని చెప్పారని రాజారావు తెలిపారు.


కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

కేంద్ర బలగాల కవాతు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సార్వత్రిక ఎన్నికలు సందర్భంగా మంగళవారం పోలీసులు ఎస్ఐ డి. రామగణేష్ ఆధ్వర్యంలో కవాతు నిర్వహించారు. రాష్ట్రంలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో శాంతి భద్రతలకు ఎటువంటి విఘాతం కలగకుండా కేంద్ర పోలీసు బలగాలతో కవాతు నిర్వహించారు. ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించు కొనేందుకు, ప్రజల భద్రతకు భరోసా కల్పించుటలో భాగంగా స్థానిక రామతీర్థం జంక్షన్ నుండి మొయిద జంక్షన్ మీదుగా జర్జాపుపేట వరకు కేంద్ర పోలీసు బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రామ గణేష్ మాట్లాడుతూ ప్రజలందరూ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించాలని, అసాంఘిక శక్తులకు సహకరించవద్దని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తుల సమాచారం అందించాలని కోరారు.

రూ.25 కోట్లతో అభివృద్ధి పనులు

ప్రజాశక్తి - రేగిడి

మండలంలోని పెద్ద శిర్లాం గ్రామంలో రూ.25 కోట్లతో అభివృద్ధి పనులను ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, రాజాం నియోజకవర్గం వైసిపి ఇంఛార్జి తలే రాజేష్ మంగళవారం ప్రారంభించారు. రైతు భరోసా కేంద్రం, పంచాయతీ నిధులతో సిసి రోడ్లు, కాలువలు అభివృద్ధి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా రంజిక పాలన వైసిపితోనే సాధ్యమన్నారు. పేద ,బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే వైసిపి ప్రభుత్వం ధ్యేయమన్నారు. పేదవాడే ప్రామాణికంగా ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. రానున్న రోజుల్లో వైసిపికి ప్రజల మద్దతు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అప్పల నరసమ్మ, వైస్ ఎంపిపిలు టంకాల అచ్చెంనాయుడు, వావిలపల్లి జగన్మోహన్ రావు, పాలవలస శ్రీనివాస రావు, వైసిపి నాయకులు లెంక రాంబాబు, మండల విప్ మజ్జి శ్రీనివాస రావు, రాయపు రెడ్డి కృష్ణా రావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విక్రాంత్

నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

ప్రజాశక్తి - బొబ్బిలి

ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్య సేవాలందించాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు కోరారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో మంగళ వారం ఆసుపత్రి అభివృద్ధి సలహా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం వైద్య రంగానికి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆసుపత్రిలో ఉన్న సమస్యలపై చర్చించి పరిష్కారానికి తీర్మానం చేశారు. సమావేశంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ జి.శశిభూషణరావు, హెచ్.డి.ఎస్ కమిటీ సభ్యులు సుబ్బారావు, వైద్యులు రెడ్డి రవికుమార్, జి.రామ్ నరేష్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి